సాక్షి ఒడిశా

శుక్రవారం । 13 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,16,510లు, బంగారం 300 మిల్లీగ్రాములు, వెండి 133 గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వైఫల్యాలపై ఆందోళన

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్ష నేతలు కొరాపుట్‌లో ఆందోళన చేశారు. పోలీసులు వారిని కట్టడి చేశారు.

- 8లో.



లోయలో పడిన అంబులెన్స్

రాయగడ పరిధిలో ఓ అంబులెన్స్ లోయలో పడింది. ముగ్గురు గాయపడ్డారు.

- 8లో.

మాట నిలబెట్టుకున్నాం: సీఎం

- రాష్ట్రంలో బీజేపీ పాలన ఏడాది పూర్తి
- వికాస వాహనం ప్రచార కార్యక్రమానికి శ్రీకారం

భువనేశ్వర్:

రాష్ట్ర ప్రభుత్వం తొలి వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి వికాస వాహనం ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ వాహనం రాష్ట్ర వ్యాప్తంగా సంచరిస్తుంది. మరో వైపు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరని ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అందించడంలో ఇది బలమైన పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అన్నారు.

వాగ్దానాలు వాస్తవ కార్యాచరణ

ఏడాది కిందట ఇదే రోజున జగన్నాథుని దయ, రాష్ట్ర ప్రజల నమ్మకం, మద్దతుతో రాష్ట్రంలో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగం ఇలా కొనసాగింది. 'గొప్ప ఒడిశా రాష్ట్రానికి నేను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశాను. ప్రజలకు సేవ చేయడమే నా ఏకైక లక్ష్యం, ఉద్దేశం. కళాశాలలో చదువుతున్నప్పుడు నేను జాతీయ సేవ, ప్రజా సేవ యొక్క స్ఫూర్తిని నింపుకుని స్వచ్ఛంద సేవకుడిగా, ఉపాధ్యాయుడిగా, సర్పంచ్‌గా, ఎమ్మెల్యేగా, నేడు ముఖ్యమంత్రిగా ప్రజలు సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం పోరాడాను, పోరాడుతున్నాను. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో మేము అనేక విజయాలు సాధించాము. కానీ అట్టడుగు స్థాయిలో పనిచేసే ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన పిల్లవాడు కూడా ఒక రోజు ముఖ్యమంత్రి అవుతాడనే ఆశ మాకు అతిపెద్ద విజయం. నేను ముఖ్యమంత్రి అయిన తర్వాత, మా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని మొట్టమొదట చెప్పాను. అందుకే నేను ఎల్లప్పుడూ మీ వద్దకు చేరి, అట్టడుగు స్థాయిలో మీ సమస్యలను అర్థం చేసుకుని, వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తాను. బాధ్యతలు స్వీకరించిన తర్వాత, తొలి మంత్రి మండలి సమావేశంలో 4 ప్రధాన వాగ్దానాలను నెరవేర్చాలని మేము నిర్ణయించుకున్నాము. ఆ నిర్ణయం ప్రకారం ముందుగా మహా ప్రభువు శ్రీ జగన్నాథుడు కొలువై ఉన్న శ్రీమందిరం 4 ద్వారాలను తెరిచాము. అలాగే ఆలయ అభివృద్ధి కోసం రూ. 500 కోట్ల కార్పస్ నిధిని సృష్టించాము. సుభద్ర యోజనను ప్రారంభించి కేవలం ఒక సంవత్సరంలో 1 కోటి పైబడి మహిళలకు సాధికారత సాధ్యం చేయగలిగాం. ఆహార దాతలకు రూ. 800 అదనపు సహాయంతో వరి కొనుగోలు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాలుకు రూ. 3,100 అందుతోంది. ఏడాది పాలనలో 21 వాగ్దానాలలో 11 నెరవేర్చాము. నేడు ఒడిశా వాస్తవ అభివృద్ధి వైపు పయనిస్తోంది.ఈ ఒక్క సంవత్సరంలోనే సామాన్యులకు, ప్రభుత్వానికి మధ్య కృత్రిమ అడ్డంకిని తొలగించాం. నేడు, ఏ వ్యక్తి అయినా ముఖ్యమంత్రిని, మంత్రులను ఎలాంటి అడ్డంకులు లేకుండా కలవవచ్చు. ఈ సమయంలో, ప్రభుత్వం వివిధ రంగాలలో అద్భుతమైన విజయాల్ని సాధించి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వాస్తవంగా అమలు చేయడం విశేషం ' అని అన్నారు. 'మేము చెప్పినది చేశాం. కొత్త ఉపాధి కల్పన, అంత్యోదయ గృహ యోజన కింద నిరాశ్రయులకు పక్కా ఇళ్లు, తునికాకు తుంచే కార్మికులకు సహాయం, ఆయుష్మాన్ భారత్ యోజన ద్వారా ఆరోగ్య సంరక్షణ, గిరిజన విద్యార్థులకు ఆర్థిక సహాయం, కొత్త విద్యా విధానం (ఎన్‌ఈపీ) అమలు, రోడ్డు, రైలు, విమానయాన పథకాల ద్వారా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం మొదలైనవి అభివృద్ధి చెందిన ఒడిశాకు పునాది వేస్తున్నాయి' అని తెలిపారు.



వికాస ఒడిశా పతాకం ఊపి వికాస వాహన ప్రచారం ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



ఏడాది పాలన పూర్తి సందర్భంగా ముఖ్యమంత్రిని అభినందించిన మంత్రి మండలి సభ్యులు



ఏడాది పాలన పూర్తి వికాస సంచిక ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

న్యూస్‌రీల్

భువనేశ్వర్-అబుదాబి విమాన సేవలు ప్రారంభం



విమాన సేవలు ప్రారంభిస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: యూఏఈ రాజధాని అబుదాబికి రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి డైరెక్ట్ విమాన సేవలను రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి గురువారం ప్రారంభించారు. భువనేశ్వర్ నుంచి అబుదాబికి ప్రతి బుధ, శుక్ర, ఆదివారాల్లో ఇండిగో విమానం రాకపోకలు సాగిస్తుంది. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విదేశాలకు ఇది 5వ విమాన సేవ కావడం విశేషం.

చిరుత పులి పట్టివేత



పట్టుబడిన చిరుత పులి

కొరాపుట్: నరమాంస భక్షక చిరుత పులిని అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా సరిహద్దు రాయిఘర్ సమితికి కూతవేటు దూరంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా దుద్మా అటవీ ప్రాంతంలో పట్టుకున్నారు. 2024 నుంచి నేటి వరకు ఆరుగురు వ్యక్తులపై దాడి చేసింది. ఈ పులి వల్ల సరిహద్దు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ నెల 7వ తేదీ నుంచి అటవీ సిబ్బంది అనేక ప్రయాసలు పడి చిరుతని పట్టుకున్నారు. సుమారు 20 కెమెరాలు పలు చోట్ల అమర్చి ఈ నాలుగేళ్ల చిరుతని పట్టుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి కాంకేర్ జిల్లా కేంద్రానికి తరలించారు.

కొరాపుట్‌లో పలు రైళ్లకు అంతరాయం



కొరాపుట్ రైల్వేస్టేషన్

కొరాపుట్: కొరాపుట్ రైల్వే జంక్షన్‌లో శుక్రవారం నుంచి ఈ నెల 19 వరకు పలు రైళ్లకు హాల్టు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జగదల్‌పూర్ నుంచి రౌర్కెలా, భువనేశ్వర్, హౌరా వెళ్లే ప్రయాణికులు కొరాపుట్ రైల్వేస్టేషన్‌కు రావద్దని సూచించారు. వీరు మనబార్, దమంజోడి స్టేషన్లకు చేరుకుని అక్కడి నుంచి ప్రయాణం సాగించాలన్నారు. కొరాపుట్-విశాఖపట్నం ఇంటర్ సిటీ, ప్యాసింజర్ రైళ్లు దమంజోడి వరకే నడుస్తాయని పేర్కొన్నారు. జగదల్‌పూర్-విశాఖపట్నం రైళ్ల రాకపోకలలో ఏ మార్పు లేదని, అవి కొరాపుట్ స్టేషన్లో ఆగుతాయని స్పష్టం చేశారు. కొరాపుట్-సుక్కు డబ్లింగ్ పనులు జరుగుతున్నందున రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

గృహ నిర్మాణ పథకంలో అవినీతి!



ప్రధానమంత్రి ఆవాస్ యోజన పత్రాలతో గిరిజనులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి గౌడ్‌గూడ పంచాయతీ కలంగూడలో ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన నిధులను సమితి ఉపాధ్యక్షుడు నిరంజన్ హల్దార్ స్వాహా చేసి తమకు ఇళ్లు నిర్మించలేదని గ్రామస్తులు గురువారం ఆరోపించారు. ఇల్లు కట్టిస్తానని చెప్పి ప్రతి లబ్ధిదారుడి వద్ద రూ.40 వేలు తీసుకుని పని పూర్తి చేయలేదని, ఇప్పటికి ఆరు నెలలు గడిచినా దాటవేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై నిరంజన్ వద్ద ప్రస్తావించగా.. తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. మల్కన్‌గిరి కమ్యునిటీ వెల్ఫేర్ అధికారి మాట్లాడుతూ పంచాయతీరాజ్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు.

భద్రక్‌లో మత ఉద్రిక్తతలు


- 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

భువనేశ్వర్ : భద్రక్ జిల్లాలో మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రతిస్పందనగా జిల్లా యంత్రాంగం 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలని నిర్ణయించింది. సమస్యాత్మక ప్రాంతాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాల సమాచారం. జిల్లా యంత్రాంగం తీసుకున్న నిర్ణయం ప్రకారం గురువారం ఉదయం 6 గంటల నుండి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు ఇంటర్నెట్ తాత్కాలిక నిలిపివేత నిరవధికంగా అమలులో ఉంటుంది. ప్రభావిత ప్రాంతాలలో భద్రక్ మున్సిపాలిటీ, భద్రక్ మండలం, తిహిడి, ధామ్‌నగర్ మండలం, ధామ్‌నగర్ మున్సిపాలిటీ ఉన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రభావిత ప్రాంతాలలో 27 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది. భద్రక్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మనోజ్ రౌత్ ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం భద్రక్‌లోని తిహిడి పోలీస్ ఠాణా ప్రాంతంలో పశువుల అక్రమ రవాణాదారుల దాడిలో సంతోష్ పరిడా అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మరణించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటన తర్వాత జిల్లా యంత్రాంగం ఇంటర్నెట్ నిలిపివేత నిర్ణయం తీసుకుంది. సంతోష్ పరిడా భార్య మీనతి బెహరా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిహిడి ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి ఇద్దరు ప్రధాన అనుమానితులు సహా 12 మంది నిందితులను అరెస్టు చేశారు. భద్రక్‌లో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతోంది. మిగిలిన నిందితులను అదుపులోకి తీసుకుని ఆ ప్రాంతంలో శాంతియుత పరిస్థితి పునరుద్ధరణ కోసం పోలీసులు పని చేస్తున్నారు. మృతుడి కుటుంబానికి మద్దతుగా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. సంతోష్ పరిడా 13 రోజులుగా చికిత్స పొందుతూ బుధ వారం మధ్యాహ్నం 2 గంటలకు తుది శ్వాస విడిచాడు. అది మొదలుకొని మతపరమైన ఉద్రిక్తత రగులుతుంది.

డీఐజీ సత్యజిత్ నాయక్ సందర్శన

శాంతిభద్రతల తాజా పరిస్థితిని సమీక్షించేందుకు తూర్పు ప్రాంతీయ డీఐజీ సత్యజిత్ నాయక్ భద్రక్ జిల్లా గురు వారం ప్రత్యక్షంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌తో ఆయన చర్చించారు. మత ఘర్షణలో యువకుడు మరణించిన తర్వాత అప్రమత్త చర్యగా ఐదు చోట్ల ఇంటర్నెట్ వ్యవస్థ స్తంభింపజేసినట్లు వివరించారు.

శ్రీ అనంత నారాయణుడి చిత్రపట దర్శనం



భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో చిత్ర పటాల దర్శనం గురువారం నుంచి ప్రారంభమైంది. జ్యేష్ట పూర్ణిమ నాడు మహా జలాభిషేకంతో శ్రీ జగన్నాథుడు అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స, వైద్యం కోసం తెరమరుగయ్యాడు. శ్రీ మందిరం రత్న వేదిక బోసిబోయింది. శ్రీ మందిరానికి విచ్చేసే భక్తులు, యాత్రికులకు ఈ ప్రాంగణంలో చిత్ర పటాల దర్శనం లభిస్తుంది. బలభద్ర స్వామి, దేవీ సుభద్ర మరియు శ్రీ జగన్నాథుని ప్రతీకగా 3 చిత్రపటాలు ఏర్పాటు చేశారు. పవిత్ర స్నాన పూర్ణిమ మర్నాటి నుంచి నవ యవ్వన అలంకరణ ముందు రోజు వరకు శ్రీ మందిరంలో నిరవధికంగా చిత్రపటాల దర్శనం కొనసాగుతుంది. తిరిగి స్వామి ఆరోగ్యంతో కోలుకుని యాత్రకు సిద్ధం అయ్యేంత వరకు తెర చాటున గోప్య సేవలు పొందుతాడు. పక్షం రోజులపాటు గోప్య సేవలు కొనసాగుతాయి. వాటితో కోలుకున్న స్వామి నవ యవ్వన అలంకారంతో చీకటి మండపం నుంచి వెలుపలకు ప్రత్యక్షమై భక్తులకు దర్శనం ఇచ్చేంత వరకు శ్రీ అనంత నారాయణుడి చిత్రపటం శ్రీ జగన్నాథుని ప్రతీకాత్మకంగా పూజలందుకుని భక్తులకు దర్శనం ఇస్తాడు. బలభద్ర స్వామి ప్రతీకగా వాసుదేవుడు, దేవీ సుభద్ర ప్రతీకాత్మకంగా భువనేశ్వరి చిత్ర పటాలు దర్శనం ఇస్తాయి.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నీ ప్రారంభోత్సవంలో సమితి చైర్మన్ తదితరులు

జయపురం: సబ్‌డివిజన్ కుంద్రలో కాంగ్రెస్ నేత తిరుపతి గురు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం సమితి అధ్యక్షురాలు పరమేశ్వరి పొరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి గురు జిల్లా పరిషత్ సభ్యునిగా ప్రజాలకు అనేక సేవలు అందించారని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం ప్రశంసనీమన్నారు. క్రికెట్ కమిటీ ప్రతినిధి బుబులు పటాన్నయక్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొంటున్నాయని, విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నరప్‌కు రూ.20 వేలు నగదు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సమితి వైస్ చైర్మన్ తరణీ సేన్ బిశాయి, కుంద్ర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోకుల చంద్ర పట్నాయిక్, కార్యదర్శి ధైతేరీ మల్లిక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ గురు, బ్లాక్ బీజేడీ అధ్యక్షుడు బృందావణ మల్లిక్, జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు త్రినాథ్ హరిజన్, సమితి సభ్యులు దామోదర గోండ్, కమిటీ సభ్యులు సబుజ దాస్, నవీణ బిశాయి, అజయ ధను తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలుగా ప్రముఖుల జన్మ స్థలాలు : సీఎం



మేధావుల సభకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి




ముఖ్యమంత్రి ప్రసంగం

భువనేశ్వర్: రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో 21 మంది గొప్ప వ్యక్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణ మాత్రమే కాదు, ఈ గొప్ప వ్యక్తుల జన్మస్థలాల్ని ఆదర్శ గ్రామాలుగా ఆవిష్కరిస్తామని ఆయన ప్రకటించారు. ఆయా గ్రామాల్లో స్మారక సంగ్రహాలయాలు, ఉపన్యాస కేంద్రాలు, పిల్లల పార్కులు, ఇతర అనుబంధ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 నుంచి 150 గ్రామాల్లో పలువురు ప్రముఖులు జన్మించారు. అలాంటి ప్రముఖ వ్యక్తులు జన్మించిన గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో జాతీయ అవార్డు గ్రహీతలు, మేధావులు, స్వచ్ఛంద సేవకులతో జరిగిన ప్రతిస్పందన సదస్సులో ముఖ్యమంత్రి ఈ విషయం తెలిపారు.

శ్రీ మహాలక్ష్మి దర్శనం

మహా జలాభిషేకంతో శ్రీ జగన్నాథుని దర్శనం కనుమరుగైంది. గురువారం నుంచి శ్రీ మందిరంలో స్వామి దర్శనం కరువైంది. సమాన మోక్ష ప్రసాదించే బ్రహ్మగిరి శ్రీ అలరనాథ్ ఆలయం వైపు భక్తులు అడుగులు వేస్తున్నారు. ఈ దేవస్థానంలో అలార్ నాథునితో కొలువైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం ప్రాధాన్యత సంతరించుకుంది.

- భువనేశ్వర్



మహిళలకు వంటల పోటీలు



వంటకాలను పరిశీలిస్తున్న కలెక్టర్



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీ మహిళలు

రాయగడ: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. రాయగడ మున్సిపాలిటీ పరిధిలోని అశోక్ కళ్యాణ మండపంలో గురువారం మహిళలకు సంప్రదాయ వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయకుమార్ ఖెముండొ, సబ్ కలక్టర్ రమేష్ చంద్ర జెన్న తదితరులు పాల్గొన్నారు.

జాజ్‌పూర్ జిల్లాలో అతిసారం

- నలుగురు మృతి
- కలుషిత నీరు కారణం



జాజ్‌పూర్ జిల్లాలో ఆస్పత్రి పాలైన అతిసారం పీడితులు

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో అతిసారం వ్యాప్తి చెంది నలుగురి ప్రాణాలను బలిగొంది. మరో 300 మంది ఆస్పత్రి పాలయ్యారు. ప్రధాన జిల్లా వైద్య అధికారి (సీడీఎంఓ), ప్రకాష్ చంద్ర బాల్ మరణాలను ధ్రువీకరించారు. ధర్మశాల, వ్యాసనగర్, ధనొగొడి, పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సంక్షోభం నెలకొని ఉంది. కలుషితమైన నీరు, పారిశుధ్య నిర్వహణ లోపం వల్ల ఈ వైపరీత్యం తాండవించిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ నిర్వీర్యం అయిందనే ఆరోపణలు వ్యాపిస్తున్నాయి. వ్యాసనగర్‌లో 65 మందికి పైగా, జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రిలో 80 మంది పైబడి రోగులు చేరారు. 11 మంది పరిస్థితి విషమించడంతో కటక్ ఎస్సీబీ మెడికల్ కాలేజీకి ఆస్పత్రికి తరలించారు. పలు ప్రాంతాల్లో స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో చేరి చికిత్స పొందుతున్నారు. ప్రాథమిక దర్యాప్తులో కలుషిత నీరు కారణంగా అతిసార విజృంభించిందని స్పష్టమైంది. ప్రభావిత ప్రాంతాలలో కుళాయిల నుంచి బురద, దుర్వాసన వచ్చే నీరు సరఫరా అవుతుందని ఆరోపణలు ఉన్నాయి. జాజ్‌పూర్‌లో ప్రధానంగా సుకింద, ధర్మశాల, వ్యాసనగర్ ప్రాంతాల్లో పరిశుభ్రమైన నీటి వనరులు కొరవడిన కారణంగా బావులు మరియు పైపులైన్లు వంటి శుద్ధి చేయని ప్రజలు వనరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ నీరు తరచుగా మల కోలిఫామ్‌లు లేదా విబ్రియో కలరా వంటి వ్యాధికారకాలతో కలుషితం అవుతుంది. వేసవిలో నీటి ఎద్దడి ఈ పరిస్థితులకు మరింత ఆజ్యం పోసింది. సురక్షిత తాగు నీరు కొరతతో అందుబాటులో ఉన్న నీటి వినియోగానికి ప్రజలు అలవాటు పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్లు, బావుల నీరు అపరిశుభ్రం కావడంతో ప్రాణాంతకంగా మారుతోంది. పరిస్థితి వికటించడంతో శుద్ధి చేసిన నీటి సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్ విభాగం కృషి చేస్తోంది. ప్రజలకు సురక్షిత తాగు నీరు సరఫరా చేయడంలో వ్యవస్థాగత నిర్వహణ సమస్యలు తొలగించనంత వరకు ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడడం సాధ్యం కాదని స్థానికులు వాపోతున్నారు. పాడైన మామిడి పండ్లు, విందులు, వినోదాల్లో అపరిశుభ్రత నీటి వినియోగం కారణంగా అతిసార వ్యాప్తి చోటు చేసుకుందని జిల్లా ప్రధాన వైద్యాధికారి పేర్కొన్నారు. జిల్లా ఆహార భద్రతా విభాగం ఆహార కాలుష్యాన్ని పరిష్కరించడానికి చర్యలను అమలు చేస్తోంది.

క్లుప్తంగా

చీకటి గదిలో జగన్నాథుడు



పట్టచిత్రాల్లో దేవతామూర్తులు

పర్లాకిమిడి: శ్రీజగన్నాథ స్వామికి దేవస్నానం జరిగిన అనంతరం గత రాత్రి చీకటి గదిలో స్వామివారిని ఉంచారు. దీంతో పురుషోత్త ముడు పద్నాలుగు రోజులు ఉండి ఉక్కపోతకు గురౌతారు.

లోయలో పడిన అంబులెన్స్



సంఘటనా స్థలంలో ఉన్న అంబులెన్స్

రాయగడ: జిల్లాలోని కెందుగుడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొయిబొందొ మలుపు వద్ద అంబులెన్స్ అదుపుతప్పి 30 అడుగుల లోతున ఉన్న లోయలో పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అంబులెన్స్ సిబ్బందికి గాయాలయ్యాయి. బుధవారం రాత్రి అంబులెన్స్‌లో రోగిని బరంపురం తరలించి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అంబులెన్స్ నుజ్జునుజ్జు అయింది. ప్రమాదంలో గాయపడిన ఫార్మాసిస్ట్, డ్రైవర్, హెల్పర్‌ను అటువైపుగా వస్తున్న మరో అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. రాయగడ జిల్లా కేంద్ర ఆస్పత్రికి చెందిన అంబులెన్స్‌గా సమాచారం.

పశువుల తరలింపు అడ్డగింత

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా గేదెలను తరలిస్తుండగా నరసన్నపేట పోలీసులు అడ్డుకున్నారు. బరంపురం నుంచి రాజమండ్రికి బొలెరో వ్యాన్‌లో ఐదు గేదెలను తరలిస్తుండగా మడపాం టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేశారు. గేదెలను అలమండ గోశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.4.95 లక్షలు



పాతపట్నం: నీలమణి దుర్గ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.4,95,520 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 30 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ హుండీని గురువారం లెక్కించామని, టెక్కలి గ్రూపు దేవాలయాలు కార్యనిర్వహణాధికారి టి.పి.మనస్విి పర్యవేక్షించారన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, శ్రీ వెంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి పాలకొండ రోడ్డులో ఏర్పడిన భారీ గోతిలో దిగబడిన ఆటో

కొత్తూరు: కొత్తూరులోని పాలకొండ రోడ్డులో త్రినాథ స్వామి ఆలయం వద్ద ఏర్పడిన భారీ గోతిలో గురువారం ఓ ఆటో దిగబడింది. వర్షం కారణంగా గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పడిపోయిన సమయంలో ఆటో వెనుక ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ముగ్గురు తహశీల్దార్లకు బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ముగ్గురు తహశీల్దార్లకు బదిలీ చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ జి–సెక్షన్ సూపరింటెండెంట్ జి.ఎల్.శ్రీనివాస్ ను లావేరు తహశీల్దార్‌గా నియమించారు. పాతపట్నం తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్ రణస్థలం మండలం బదిలీ అయ్యారు. రణస్థలం తహశీల్దార్ గా పని చేసినఎం.ప్రసాదరావును పాతపట్నం తహశీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు ఆలయాల్లో చోరీ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కనుగులవానిపేట గ్రామంలో గల పొదిలాపు అమ్మవారి గుడితో పాటు పక్కనే గల శ్రీ వెంకటేశ్వర ఆలయంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత దొంగతనం జరిగింది. గురువారం ఉదయం ఆలయానికి వెళ్లిన పురోహితుడు తలుపులు బార్లా తెరిచి ఉండడడంతో గ్రామస్తులకు విషయం చేరవేశారు. వారు వెంటనే శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దొంగతనంలో రూ.2వేలు నగదుతో పాటు ఇతరత్రా వస్తువులు దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. గ్రామస్తులు రాలు కనుగుల అశ్విని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.లక్షల విలువైన సామగ్రి చోరీ

జయపురం: జయపురం సునారి వీధిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆఫీసులో, గొదాంలో లక్షల రూపాయల విలువైన సామానులు చోరీకి గురైనట్లు హెచ్ఎం కె.సునీత పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాల గొదాంలో గల 50 కేజీల 24 బియ్యం బస్తాలు, 8 ఫ్యాన్‌లు, పుస్తకాలు ఉంచే ఇనుప అలమారా, వాటర్ మోటారు పైపు, మధ్యాహ్న భోజన వంట సామగ్రి, టీవీ, బెండింగ్ మిషన్, బియ్యం తూచే మిషన్, పిల్లలు ఆడుకొనే క్రీడా సామగ్రితోపాటు కొన్ని లక్షలు విలువ చేసే సామగ్రి చోరికి గురైనట్లు ఆమె బుధవారం సాయంత్రం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం పాఠశాలకు వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. పాఠశాల ప్రాంతంలో ఉన్న సీసీ పుటేజీలు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. వేసవి సెలవుల కారణంగా పాఠశాల మూసి ఉంచారు. అన్ని గదులతోపాటు పాఠశాల తలుపులకు తాళాలు వేశారు. ఈ నెల 18వ తేదీన పాఠశాల తెరవాల్సి ఉండగా.. ముందుగా పాఠశాల పరిశుభ్ర పరిచేందుకు పాఠశాలలో ఉన్న సామగ్రి, వస్తువులు పరిశీలించేందుకు హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చారు. పాఠశాల బయట గేటు తాళాలు వేసి ఉన్నాయి. గేటు తెరచి లోపలకు వెళ్లిన వారికి పాఠశాల ఆఫీస్ తలుపు తాళాలు విరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లిన వారికి బీరువా తెరిచి ఉండటం కనిపించింది. సామానులు చిందరవందరగా పడి ఉన్నాయి. పిల్లల పుస్తకాలు ఉంచే 2 అడుగుల వెడల్పు, 6 అడుగుల పొడవు గల ఇనుప అలమారా కనిపించ లేదు. బియ్యం నిల్వ ఉంచే మరో గది తాళాలు బయట పడి ఉన్నాయి. ఆ గది గోడ కొంత భాగం పడగొట్టి టిన్ రూఫ్‌ను తొలగించి 50 కేజీల బరువుగల 24 బియ్యం బస్తాలను దొంగిలించుకుపోయారు. పాఠశాలలో దొంగతనంగా బియ్యం బస్తాలను దొంగిలించుకుపోతుండటం బియ్యం గది పక్కన కూర్చొని మద్యం సేవిస్తున్న వారు చూచినట్లు వెల్లడైంది. పాఠశాలలో దొంగతనం జరిగిన సమాచారం అందిన జయపురం బ్లాక్ విద్యాధికారి చందన నాయక్ పరిస్థితిని తెలుసుకోవాలని సి.ఆర్.సి.ఎస్ విజయ లక్ష్మీ పాణిగ్రహిణి పంపారు. ఆమె పాఠశాలకు వచ్చి ప్రధాన ఉపాధ్యాయురాలితోపాటు ఉపాధ్యాయులందరితో చర్చించింరారు. ఆ చర్చల్లో జయపురం సమితి ఉపాధ్యాయ సంఘం సంఘ అధ్యక్షుడు దేవీ ప్రసాద్ దాస్, వంట సిబ్బంది పాల్గొన్నారు. జయపురంలో ఇటీవల పాఠశాలల్లో దొంగతనాలు జరుగుతున్నాయని, కొద్ది రోజుల కిందట జయపురం జయనగర్ ఉన్నత పాఠశాలలో జరిగిన దొంగతనాన్ని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. 72 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన సునారి వీధి పాఠశాలలో దొంగతనం జరగటం ఇదే మొదటిసారి అని అంటున్నారు. పోలీసులు దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దొంగతనం జరిగిన సునారి వీధి ఉన్నత పాఠశాల



పాఠశాలలో బియ్యం దోచుకుపోయిన గది



పాఠశాల ఉపాధ్యాయులతో విజయలక్ష్మీ పాణిగ్రహి, తదితరులు



గదులలో పోయిన వస్తువుల వివరాలు సేకరిస్తున్న పాఠశాల సిబ్బంది



పాఠశాల ఉపాధ్యాయ బృందం

ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళన



ఆందోళన చేస్తున్న కౌసల్య హిక్కా తదితరులు



రబినారాయణ నందో,రమేష్ చంద్ర మజ్జి,చంద్ర శేఖర్ మజ్జిలను వ్యాన్‌లో తీసుకెళ్తున్న పోలీసులు

కొరాపుట్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన ఆందోళనలో కొరాపుట్ జిల్లాల నేతలు కీలక భూమిక వహించారు. గురువారం ప్రతి పక్ష బీజేడి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అధికారంలోనికి వచ్చి ఏడాది పూర్తయినా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు. ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నరాష్ట్ర బీజేడి ఉపాధ్యక్షుడు రబినారాయణ నందో, రాష్ట్ర సాధారణ కార్యదర్శులు రమేష్ మజ్జి, ప్రదిప్ మజ్జి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ మజ్జి, కౌసల్య హిక్కా తదితరులు అరెస్టయ్యారు.

డ్వాక్రా డబ్బు స్వాహా..?

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 12వ వార్డు లక్ష్మీనగర్ వీధికి చెందిన మెప్మా ఆర్‌పీ లక్షల రూపాయల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు చెందిన పొదుపు మొత్తాలను స్వాహా చేసినట్లు సమాచారం. ఆ వార్డు పరిధిలో సుమారు 50 గ్రూపులకు చెందిన పొదుపు మొత్తాలను గత కొన్నేళ్లుగా వసూళ్లు చేసినట్లు సమాచారం. అయితే ఆ మొత్తాలను బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా ఆమె సొంతానికి వాడుకున్నారని గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు. రూ.6–7లక్షల వరకు వసూలు చేసి ఉండవచ్చని సమాచారం. మహిళలు కొంతమంది నిలదీస్తుండడంతో ఇటీవల ఆమె ఇంటికి తాళం వేసుకొని వేరే చోటుకు వెళ్లిపోయినట్లు తెలి సింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు మహిళా సంఘాల సభ్యు లు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై మెప్మా పీడీ ఎస్వీ రమణను సంప్రదించగా దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.29 వేలు లూటీ

టెక్కలి రూరల్: తన ఏటీఎం కార్డు మార్చి తన అకౌంట్‌లో నగదు కాజేశారని ఓ మహిళ టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. అయితే నాలుగు రోజులుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె వాపోతున్నారు. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని భగవాన్‌పురం గ్రామానికి చెందిన నార లోలాక్షి అనే మహిళ గత నెల 20 వ తేదీన టెక్కలిలో గల ఓ ఏటీఎంలో డబ్బులు తీసేందుకు వెళ్లారు. డబ్బులు ఎలా తీయాలో తెలియకపోవడంతో వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి తన ఏటీఎం కార్డు ఇచ్చి రూ.7000 నగదును తియ్యమని తన పిన్ నంబర్ చెప్పారు. ఆ వ్యక్తి ఏటీఎం నుంచి నగదు తీసి కార్డు మార్చేశాడు. అనంతరం ఈ నెల 6వ తేదీన కార్డులో రూ.7వేలు తీసినట్లు మెసేజ్ రావడంతో ఆమె ఆందోళనకు గురై బ్యాంకుకు వెళ్లారు. అకౌంట్ నుంచి మొత్తం రూ.29వేల నగదును పలాసలో ఓ ఏటీఎం నుంచి తీశారని చెప్పడంతో ఆమె ఈ నెల 8న టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆమె తెలిపారు. ఇదే విషయమై టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ వద్ద ప్రస్తవించగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

కాటేసే కాలం



- ఖరీఫ్‌లో విషసర్పాలతో జాగ్రత్త
- వానాకాలంలో పాముల సంచారం ఎక్కువ

హిరమండలం: పొలం పనులు మొదలైపోయాయి. వానలు పడుతుండడంతో రైతులకు పొలాలకు వెళ్తున్నారు. అయితే ఈ కాలంలో రైతులు పాము కాటుకు గురవుతుంటారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈ నెల నుంచి దాదాపు నవంబర్ వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



పొలం పనులు చేస్తున్న రైతులు

ఈ జాగ్రత్తలు పాటించాలి

- పొలాల గట్లమీద వెళ్లేటప్పుడు కర్రచప్పుడు చేస్తూ నడవడం మంచిది.
- రాత్రిపూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లినప్పుడు టార్చిలైట్ తీసుకుని వెళ్లాలి.
- ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలి.
- పాము కాటు కంటే చాలామంది షాక్‌తోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటారు. ● ఇంట్లో వారు ధైర్యం చెప్పాలి.
- పాముకాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తం తో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు అలా చేయకూడదు. ఒక్కోసారి పాము కాటుకన్నా ఈ ఆగాయం ప్రమాద కరంగా మారవచ్చు.

పాముకాటు లక్షణాలు

- పాము కాటు వేసిన ప్రదేశంలో రెండు కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు అనిపిస్తాయి.
- కళ్లు మగతగా శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు

పాములు విషప్రభావం

కట్ల పాము: ఇది కాటేసిన క్షణాల్లోనే విషం రక్త కణాల్లో కలుస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.

నాగుపాము: ఇది కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది.

రక్తపింజర : ఇది కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది.

జెర్రిపోతు, నీరుకట్ట: ఇది కాటేసినా విషం ఉండదు. కానీ చికిత్స తీసుకోవడం అవసరం.

అందుబాటులో వ్యాక్సిన్



పాముకాటు బారిన పడిన వారికి పీహెచ్‌సీల్లో చికిత్స అందుబాటులో ఉంటుంది. వారికి కావాల్సిన యాంటీస్నేక్‌వీనం ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాటు కాటుకు గురైన వ్యక్తి ఆందోళన, భయం చెందకుండా నిర్భయంగా ఉండాలి. గాయంపై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. వెంటనే ప్రథమ చికిత్స చేసి గాయాన్ని బట్టి రెండు సార్లు స్నేక్‌వీనం డోస్ తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు. పాము కరిచిన వెంటనే ఏదైనావాహనంలో ఆరోగ్య కేంద్రానికి చేర్చాలి. నడిపించకూడదు.

– ఫారుక్ హుస్సేన్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, హిరమండలం

శ్రీమందిర్‌లో దీపకాంతులకు సన్నాహాలు



నిపుణులతో మాట్లాడుతున్న శ్రీమందిరం సీఏఓ

- ఏఎస్ఐ ఆధ్వర్యంలో డీపీఆర్ రూపకల్పన

భువనేశ్వర్: పూరీ మందిరం దీపాలంకరణతో కొత్త రూపు దాల్చనుంది. శ్రీ మందిరం, ప్రధాన దేవస్థానం సముదాయంలో పార్శ్వ ఆలయాలు కొత్త కాంతులతో సిద్ధం కానున్నాయి. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సహాయంతో ఈ మేరకు చర్యలు చేపడుతున్నారు. ఈ విషయమై శ్రీమందిరం కార్యాలయంలో ప్రధాన పాలకుడు (సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాడీ అధ్యక్షతన గురువారం ముఖ్యమైన సమావేశం జరిగింది. శ్రీమందిరం సీనియర్ ఇంజినీర్లు, ఏఎస్ఐ పూరీ సర్కిల్ అధికారులు, ఢిల్లీలోని ఏఎస్ఐ గుర్తింపు పొందిన సంప్రదింపుల సంస్థ ప్రతినిధి శిల్పి భరద్వాజ్ హాజరయ్యారు. వివిధ వారసత్వ ప్రాజెక్టుల కోసం చేసిన విద్యుద్దీప అలంకరణ పనులకు సంబంధించి సంబంధిత సంస్థలు వివరాల్ని ప్రదర్శించాయి. ప్రతిపాదిత దీపకాంతుల కోసం శ్రీమందిరం పాలకవర్గం కొన్ని నిర్దిష్ట సూచనలను జారీ చేసింది. భారత పురావస్తు శాఖ సాంకేతిక సలహా, మార్గదర్శకత్వంతో వివరణాత్మక నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తోంది. పాలక మండలి ఆమోదం కోసం సకాలంలో నివేదిక దాఖలు చేయాలని సమావేశంలో చర్చించారు. తదనంతరం అవసరమైన అనుమతులు పొందిన తర్వాత ఆలయ సముదాయం విద్యుద్దీప కాంతుల పనుల కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని నిర్ణయించారు.

ఆగస్టులో ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య 310 నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర స్థాయి బొత్స అప్పలస్వామి (మర్రివలస మాస్టర్) స్మారక పౌరాణిక, సాంఘిక, జానపద పద్యనాటక ఏకపాత్రాభినయ పోటీలు ఆగస్టులో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య సభ్యులు ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బంటుపల్లి రామచంద్రదేవ్, చిట్టి వెంకటరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో జరిగే ఈ పోటీల్లో పాల్గొనే నియమ నిబంధన లకు లోబడి పాల్గొనాలని కోరారు. ఎంట్రీ ఫీజు కింద రూ.300లు ఫోన్‌పే నంబరు 9440347848కు చెల్లించాలని, స్క్రూటినీ ద్వారానే అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. పౌరాణిక, జానపద, సాంఘిక పద్యాలతో కూడిన ఏకపాత్రలు అనుమతిస్తామన్నా రు. జూలై 5లోగా ఎంట్రీలు నమోదు చేసుకోవాలని సూచించారు. బి.రామచంద్రదేవ్ (9440347848), పొట్నూరు వేంకటరావు (9490344620), ఐ.రమణారావు (9441320125)లను సంప్రదించాలని తెలిపారు. విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ. 2వేలు అందజేస్తామన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



చీపురుపల్లి గ్రామంలోని నిర్వాసితుల శిబిరం

మెళియాపుట్టి: రేగులపాడు ఆఫ్‌షోర్‌కు గ్రామాన్ని ఇచ్చిన చీపురుపల్లి నిర్వాసితులలకు న్యాయం జరగాలంటే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆఫ్‌షోర్ నిర్వాసితులు చేపట్టిన నిరాహార దీక్షలు 22వ రోజుకు చేరుకోవడంతో గురువారం చీపురుపల్లిలోని దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ హిరమండలం నిర్వాసితులకు ఇచ్చిన 460 జీఓ ప్రాప్తికి పూర్తిస్థాయి ప్యాకేజీలు ఇవ్వాలని కోరారు. వలస కూలీలుగా పలు ప్రాంతాలకు వెళ్లిన 132 మంది నిర్వాసితులకు ప్యాకేజీలు లేవని అన్నారు. డీ పట్టా భూములకు సొమ్ములు చెల్లించాలని అన్నారు. చెల్లింపుల్లో తేడాలు ఉన్నాయని వాటిని సవరించి ఇళ్లకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నిర్వాసితులందరూ ఏకతాటిపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరావు, కొక్కిరి కిరణ్, ఉమాశంకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆదిత్యాలయ ఈఓ బాధ్యతల స్వీకరణ



ఈఓగా బాధ్యతలు చేపట్టిన కేఎన్‌వీడీవీ ప్రసాద్

అరసవల్లి: రాష్ట్ర దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయాలకు కొత్తగా ఆస్తులను సమకూర్చేలా చర్యలు చేపడతామని, తద్వారా ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని ఆలయ ఈఓ కేశవమతం నాగవెంకట దుర్గా వరప్రసాద్ స్పష్టం చేశారు. అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామి ఆలయానికి కొత్త ఈఓ (డిప్యూటీ కమిషనర్)గా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సిబ్బంది కలిసి గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించా రు. అనంతరం కొత్త ఈఓ ప్రసాద్ మాట్లాడుతూ ఆలయాలకు సమీ పంలో అభివృద్ధికి ఆస్కారమున్న పరిసర ప్రాంతాలను రెవెన్యూ దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి, ఆలయ ఆస్తులను పెంచేలా చర్యలు చేపడతామన్నా రు. అరసవల్లి ఆలయానికి కూడా పరిసర ప్రాంతాల్లో భూముల కొనుగోలు అంశం పెండింగ్‌లో ఉన్నట్లు గా సమాచారం ఉందని, దీన్ని త్వరితగతిన పూర్తి చేయించి తద్వారా ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని ప్రకటించారు. భక్తులకు కూడా ఆలయ పరిసరాల్లో ఎక్కడైనా అసౌకర్యం కలిగితే నే రుగా తనను సంప్రదించవచ్చునని స్పష్టం చేశారు.

మెగా ఉద్యోగ మేళాలో 263 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ దానేటి పద్మాజా కామేశ్వరరావు, ఉరిటి సాయికుమార్

కాశీబుగ్గ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సూర్యతేజ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 763 మంది హాజరుకాగా అందులో 263 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి మాట్లాడుతూ జాబ్ మేళాకి హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ పద్మాజీ కామేశ్వరరావు మాట్లాడుతూ యువతలో ఉండాల్సిన నైపుణ్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగ అవకాశం వచ్చినా సరే దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంద్ ప్రశాంతం



రాయిఘర్‌లో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండో, తదితరులు



మాట్లాడుతున్న రబినందో, రమేష్ మజ్జి, ప్రదిప్ మజ్జి

కొరాపుట్:

రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించాలనే డిమాండ్‌తో జరిగిన రాయిఘర్ బంద్ ప్రశాంతంగా జరిగింది. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితిలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరవదిక బంద్ జరిగింది. ఈ సమితిలో 344 మంది రైతులు 14 వేల క్వింటాళ్ల ధాన్యం ప్రభుత్వానికి విక్రయించారు. వారికి రు.4.4 కోట్లు అకౌంట్లలో పడాల్సి ఉంది. సుమారు 3 నెలలు కావస్తున్నప్పటికీ వారికి ఒక్క రూపాయి కూడా అందలేదు. ఈ కుంభకోణంపై ప్రతిపక్ష బీజేడీ చాలా కాలంగా ఆందోళనలు చేస్తుంది. ఈ నేపథ్యంలో బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రబినారాయణ నందో, పార్టీ రాష్ట్ర సాధారణ కార్యదర్శులైన మాజీ ఎంపీలు రమేష్ చంద్ర మజ్జి, ప్రదిప్ మజ్జి బుధవారం రాత్రి ఆకస్మిక బంద్‌కు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం నుంచి సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి రాకపోకలు నిలిపి వేశారు. బీజేడీ మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండో, తదితరులు రాయిఘర్ మెయిన్ రోడ్డులో ధర్నా చేశారు. వర్తక, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు తెరవలేదు.

క్లుప్తంగా

గంజాయి నిందితుడి ఆస్తుల సీజ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: గత ఏడాది గంజాయి కేసులో అరెస్ట్ అయిన ఒడిశా వాసికి చెందిన రూ.42 లక్షల ఆస్తులు సీజ్ చేశామని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపారు. 2024లో జిల్లాలోని ఎస్.కోట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో నిందితుడిగా అరెస్టు అయిన ఒడిశాలోని కొరాపుట్ జిల్లా నందపూర్ మండలం, బసుపుట్ గ్రామానికి చెందిన వ్యాపారి పతి ఖిల అలియాస్ గురు (32)కు చెందిన రూ.42,70,000 విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి గురు 200కిలోల గంజాయిని గతేడాది అక్టోబరు 6న తరలిస్తూ ఎస్.కోటలో పందిరప్పన్న జంక్షన్ వద్ద పోలీసులకు పట్టుబడినట్లు చెప్పారు. విచారణలో నిందితుడు గురు కొన్నేళ్లుగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. అలా వచ్చిన అక్రమ సంపాదనతో రూ.42,70,000 విలువైన స్థిర, చరాస్తులను కూడబెట్టినట్లు గుర్తించామన్నారు. ఆస్తుల అటాచ్ ప్రక్రియలో క్రియాశీలకంగా పని చేసిన అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్.కోట ఇన్‌స్పెక్టర్ వి.నారాయణమూర్తి, ఇతర పోలీసు అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

గంజాయి నిందితుడి అరెస్ట్

సాలూరు రూరల్: మండలంలోని దుద్దిసాగరం గ్రామ శివారులో గత నెల 7వ తేదీన 183.800 కేజీల గంజాయితో కారును రూరల్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. అయితే అప్పట్లో పరారైన నిందితుల్లో ఒకడైన దీపక్ కుమార్ పాధార్‌ను ఈ నెల 10వ తేదీన ఒడిశా రాష్ట్రంలోని సెమిలిగుడలో గల ఫ్యూజన్ హోటల్లో పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై నరసింహ మూర్తి తెలిపారు. పై అధికారుల ఉత్తర్వుల మేరకు మెజిస్ట్రేట్ వద్దకు రిమాండ్ నిమిత్తం పరిచినట్లు చెప్పారు.

పాము కాటుతో వ్యక్తి మృతి


ఆవాల సూర్య నారాయణ (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామానికి చెందిన ఆవాల సూర్యనారాయణ(31) పాముకాటుకు గురై మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై ఆర్ జయంతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సూర్యనారాయణ 10వ తేదీ రాత్రి గ్రామ సమీపంలో మల విసర్జనకు వెళ్తున్న సమయంలో చీకట్లో పాము కాటు వేయడంతో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రాము, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి


కళ్లజోడు లేకుండా న్యూస్‌పేపర్ చదువుతున్న శతాధిక వృద్ధుడు రామలింగేశ్వరుడు (ఫైల్)

వీరఘట్టం: వీరఘట్టం పట్టణానికి చెందిన శతాధిక వృద్ధుడు వూణ్న రామలింగేశ్వరుడు(103) గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ప్రస్తుత జనరేషన్‌లో 25–30 ఏళ్ల లోపే చాలా మందికి సుగర్, బీపీ, చూపు మందగించడం వంటి సమస్యలు వస్తున్నాయి. అయితే ఆయనకు నేటివరకు జ్వరం అనే మాట కూడా తెలియదని ఆయన కుమారుడు సురేష్ తెలిపారు. కళ్లజోడు లేకుండా న్యూస్‌పేపర్ ప్రతిరోజూ చదివేవారని, బుధవారం రాత్రి భోజనం చేసి పడుకున్న తన తండ్రి నిద్రలోనే కన్నుమూశారని చెప్పారు. ఇన్నాళ్లు ఒకరిపై ఆధారపడకుండా అందరికీ ఆదర్శంగా రామలింగేశ్వరుడు ఉన్నారన్నారు.

మామిడి, పామాయిల్ మొక్కల ధ్వంసం

- కోటసీతారాం పురంలో ఏనుగుల తిష్ట

సీతానగరం: మండలంలో దట్టమైన తోటలున్న కోట సీతారాంపురంలో నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు తిష్ట వేశాయి. అల్లు వాసు, సూర్యనారాయణల మామిడి తోటలో మామిడి కాయల కోసం మామిడి, పనస చెట్లను ధ్వంసం చేశాయి. ఆ పక్కనే ఉన్న మాదాసు శ్రీనివాసరావుకు చెందిన పామాయిల్ మొక్కలను నాశనం చేశాయి. దీంతో లక్షలు ఖర్చుచేసి మామిడి తోటను తయారు చేసి పంటకోతకు వచ్చే సమయానికి ఏనుగులు ధ్వంసం చేయడంతో అపారమైన నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం పంటనష్టాన్ని అంచనావేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

ఏనుగు పిల్లకు 'సీత'గా నామకరణం

కోట సీతారాంపురం గ్రామంలో బుధవారం జన్మించిన ఏనుగు పిల్లకు 'సీత' అని ట్రాకర్స్, బీట్ అధికారులు, గ్రామస్తులు కలిసి నామకరణం చేశారు. 8 ఏనుగుల గుంపుతో కోట సీతారాంపురం వచ్చిన ఏనుగులు గుంపులో పెద్ద ఏనుగు శిశువుకు జన్మనివ్వడంతో ఏనుగుల గుంపు 9కి చేరింది. వీటి సంచారాన్ని ట్రాకర్స్ గమనిస్తున్నారు.

ముందస్తు నివారణ లేకపోతే..

'చిటుక'లో గొర్రెల మృతి..!

- రోగాన్ని నిర్లక్ష్యం చేయవద్దు
- టీకాలు వేయిస్తే వ్యాధి నివారణ
- తొలకరి వర్షాలు, అకాల వర్షాలకు మొలిచిన గడ్డిని వేయరాదు
- పశు సంవర్ధక శాఖాధికారుల సూచనలు


చిటుక రోగం నివారణ టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది (ఫైల్)


రామభద్రపురం పొలాల్లో రైతులు కట్టిన గొర్రెల మంద (ఫైల్)

రామభద్రపురం: గొర్రెల పెంపకందారులకు తీవ్రనష్టం కలిగించే వ్యాధి 'చిటుక' రోగం. ఇందులో 40 శాతం వరకు మరణాల రేటు ఉంటుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు నిమిషాల్లోనే చనిపోతాయి. గొర్రెల పెంపకందారులు ప్రధానంగా చిటుక రోగంపై అప్రమత్తంగా ఉండాలి. ఈ వ్యాధి సోకితే చిటికెలో వెంటనే మరణించే ప్రమాదం ఉండడం వల్ల దీనిని చిటుక రోగం అంటారు. జిల్లాలో 1,30,180 గొర్రెలు, 43,101 మేకలు ఉన్నాయి. వాటికి ఈ వ్యాధి సోకుండా, అలాగే వ్యాధి నివారణకు ప్రభుత్వం ఇప్పటికే టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ వ్యాధితో గొర్రెలకు నష్టం జరగకుండా ఉండేందుకు టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది. టీకాల కార్యక్రమం మొదలైన నేపథ్యంలో గొర్రెల్లో ఈ వ్యాధి ఎప్పుడు వస్తుంది?లక్షణాలు ఎలా ఉంటాయి?నివారణ పద్ధతులపై పశుసంవర్ధక శాఖాధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

టీకాలు వేయిడంతో వ్యాధి నివారణ..

గొర్రెలు, మేకల్లో గాలికుంటు, మశూచి, పీపీఆర్, చిటుకు రోగం, దొమ్మ, గొంతువాపు మొదలైన అంటువ్యాధులు ఒక మంద నుంచి వేరే మందకు అత్యంత వేగంగా, సులభంగా వ్యాపించి ప్రాణనష్టం కలిగిస్తాయి. చాలా సందర్భాల్లో చికిత్స చేసేందుకు తగిన వ్యవధి కూడా ఉండదు. ఇలాంటి ప్రమాదకరమైన ప్రాణాంతకమైన వ్యాధులకు చికిత్స బదులు నివారణే శ్రేయస్కరం అని గుర్తించాలి. అంటు వ్యాధులు సోకక ముందే వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే గొర్రెలు, మేకల్లో రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది.

గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం..

మేకల్లో ఈ వ్యాధి తీవ్రత అంతగా కనిపించదు.గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం ఉంది. తొలకరిలో ఎక్కువగా వస్తుంది. తొలకరిలో పెరిగిన పచ్చికను అతిగా మేయడం వల్ల శరీరంలో ఎప్సిలాల్ అనే విష పదార్థం విడుదల కావడం వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది. మేతను తినేసి అకస్మాత్తుగా దాణాను మార్చడం వల్ల కూడా వచ్చే ప్రమాదం వచ్చే అవకాశం ఉంది.

లక్షణాలు..

రాత్రి బాగా ఉండి, తెల్లారే సరికల్లా ఎక్కువ సంఖ్యలో జీవాలు మరణిస్తాయి. జీవాలు రైతుల కళ్ల ముందే ఎలాంటి లక్ష ణాలు లేకుండా హఠాత్తుగా, గాలిలోకి ఎగురున ఎగిరి కిందపడి అకస్మాత్తుగా మరణిస్తాయి.

- జ్వరం, పళ్ల కొరకడం, వణకడం, బిగుసుకుపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను అనించి ఉండడం, కాళ్లు బిగిసి నడవడం, శ్వాస తీసుకోవడం కష్టం కావడం తదితర లక్షణాలు కనిపిస్తాయి.
- వ్యాధి తీవ్రత దశలో అధిక విరేచనాలు, కడుపునొప్పి, మందకొడిగా ఉండడం, మేత సరిగ్గా తినకపోవడం చేస్తాయి. కాళ్లను కొట్టుకుంటూ అకస్మాత్తుగా చనిపోతాయి. చనిపోయే ముందు కొద్దిగా పారుకుంటాయి. పెండలో ఒక్కసారి రక్తం కూడా వస్తుంది.

నివారణ ఇలా..

వ్యాధి రాకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అకాల వర్షాలు, తొలకరి వర్షాలు వల్ల పెరిగిన గడ్డిని గొర్రెలకు ఎక్కువగా మేపరాదు.

- వరికోసిన తర్వాత మిగిలిన కర్రలను ఎక్కువగా మేపరాదు. గొర్రెలు, మేకలకు మూడు నెలలకోసారి నట్టల నివారణ మందులు వేయాలి.
- గొర్రె, మేక పిల్లలకు 30 రోజులు దాటిన తరువాత వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. 3 నెలల తర్వాత బూస్టర్ డోస్ వేయించాలి. గొర్రె పిల్లలు అత్యధికంగా పాలు తాగకుండా గమనించాలి.
- పాలు తాగే స్థితి నుంచి ఒకే సారిగా దాణాకు మార్చకుండా క్రమ క్రమంగా మార్చుకుంటూ వెళ్లాలి.
- మేకలకు పూర్తిగా పప్పు జాతి పశుగ్రాసాలను మేపరాదు.

'చిటుక' నివారణే లక్ష్యం..



సాధారణంగా వ్యాధి సోకిన జీవాలకు చికిత్స చేసే వ్యవధి ఉండదు. వ్యాధి రాకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. సంవత్సరం వయసున్న గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే గొర్రెల్లోను, వలస గొర్రెల్లోనూ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. అంటు వ్యాధులు సోకక ముందే ఈ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే గొర్రెలు, మేకల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. గొర్రెల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలి.

ఎల్.విష్ణు, పశుసంవర్ధక శాఖ ఎ.డి, బొబ్బిలి

అన్నార్తులకు ఆసరా

- రోజూ క్యారియర్లతో భోజనం సరఫరా


మాట్లాడుతున్న గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ.స్వామినాయుడు

గరుగుబిల్లి: ఏ ఆధారం లేని నిరుపేదలు కడుపారా రెండుపూటలా తినేందుకు ఆహారాన్ని సరఫరా చేసేందుకు ఓ మంచి కార్యక్రమానికి గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు శ్రీకారం చుట్టారు. వృద్ధాప్యంలో వంట చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నవారికి అవకాశం లేని వారిని గుర్తించి వారి వద్దకు నేరుగా క్యారియర్లతో రెండుపూటలా భోజనం సరఫరా చేసేందుకు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ సేవా కేంద్రం ద్వారా చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం గరుగుబిల్లి మండలంలోని నాగూరు గ్రామంలో క్యారియర్ల ద్వారా భోజనం సరఫరా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరఘట్టం, రావివలస, చిట్టపులివలస, కెల్ల తదితర దాదాపు పది గ్రామాల్లో గత కొన్నేళ్లుగా క్యారియర్ల ద్వారా అనార్తులకు భోజనం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నాగూరులో 12 మందిని గుర్తించి వారికి కూడా ప్రతిరోజూ క్యారియర్ల ద్వారా భోజనం సరఫరా చేయనున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకే ఆహారాన్ని చిట్టపులివలసలో ఉన్న సత్యసాయి అన్నపూర్ణ సేవా కేంద్రంలో తయారు చేసి మినీ వాహనం ద్వారా తమ సిబ్బంది అన్నార్తులకు నేరుగా క్యారియర్లను అందిస్తారని తెలిపారు. ఇక్కడితో ఆగకుండా మరికొద్ది రోజుల్లో గరుగుబిల్లి మండలంలోని దత్తివలస, కారివలస, చిలకాం గ్రామాలకు కూడా ఆహారాన్ని క్యారియర్‌ల ద్వారా సరఫరాచేయనున్నట్లు తెలిపారు.

దాతల సహకారం

అన్నార్తుల ఆకలి తీర్చేందుకు మంచి ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి పలువురు దాతలు ముందుకొచ్చి వారి ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఇందులో భాగంగా కేతిరెడ్డి గాయత్రి నాయుడు జ్ఞాపకార్థం ఆయన భార్య రాధాకాంతమ్మ రూ. 2లక్షలు, గురజాడ సంస్థల అధినేత రూ.2లక్షలు, అక్కేన సత్యనారాయణ జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు అంబటి తిరుమల రావు రూ.లక్ష, ఎల్లాపు కాశీవిశ్వనాథ తన తండ్రి జ్ఞాపకార్థం రూ.లక్ష, అమెరికాలో ఉంటున్న విమలాకర్, సరళ దతాని ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష, తిరుమల తన తండ్రి జగన్నాథం జ్ఞాపకార్థం రూ.50వేలు ఆర్థిక సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశి నాయుడు వేసిన నఖ చిత్రమాల పుస్తకాన్ని గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ.స్వామినాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా రిమ్స్ సేవా సంస్థల ప్రతినిధి రమణబాబు, విశ్రాంత ఏఎస్పీ కె.భార్గవ నాయుడు, ఆధ్యాత్మిక గురువు వైఆర్‌పీ గణపతిరావు, సీతంనాయుడు, బొత్స తవిటి నాయుడు, మిరియాల సత్యనారాయణ, కేతిరెడ్డి శ్రీను, రిటైర్డ్ ఎస్ఈ కె.చంద్రశేఖరరావు, కొప్పల వెలమ సంఘం డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, బి.తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు ఆరోగ్యం మెరుగుకు కృషి

- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఎ.డి అనిల్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఎ.డి అనిల్ కుమార్

పార్వతీపురంటౌన్: మాతాశిశు ఆరోగ్య సేవలను బలోపేతం చేసే దిశగా వైద్యారోగ్యశాఖ అడుగులు వేస్తుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అదనపు సంచాలకుడు డాక్టర్ కేవీఎస్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు పర్యవేక్షణకు విచ్చేసిన ఆయన గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై ప్రస్తావించి సమీక్ష చేశారు. గర్భిణులకు వైద్యసేవలు మెరుగు పరిచే లక్ష్యంగా జననీ మిత్ర యాప్ ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. మాతాశిశు మరణాలు నివారించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. స్టేట్ కన్సల్టెంట్స్ డా.నరేంద్ర, వెంకటేష్‌లు యాప్‌పై వైద్యసిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.పద్మావతి, డీఐఓ డా.నారాయణరావు, ప్రోగ్రాం అధికారి డా.వినోద్, పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురూ ముగ్గురే..!

- కష్టపడి చదివి..ఎస్‌బీఐలో కొలువులు
- ఆనందం వ్యక్తంచేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

తెర్లాం: ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కష్టపడి చదివారు. ఆ ముగ్గురూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో కొలువులు సాధించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురికి ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్ ఉద్యోగాలు ఒక్కసారే రావడంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ వారిని ప్రశంసిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..తెర్లాం మండలం నందిగాం గ్రామానికి చెందిన అల్లు దినేష్, గంటసాధిక్, కొల్లి ప్రకాష్‌లు బుధవారం వెలు వడిన ఎస్‌బీఐ పరీక్షా ఫలితాల్లో జూనియర్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

డీసీసీబీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ..



నందిగాం గ్రామానికి చెందిన అల్లు దినేష్ తెర్లాంలోని డీసీసీబీలో స్టాఫ్ అసిస్టెంట్ (సూపర్‌వైజర్)గా ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్‌గా తెలంగాణ సర్కిల్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దినేష్ కాకినాడ జేఎన్‌టీయూలో బీటెక్ చదివాడు. తండ్రి అల్లు లక్ష్మణరావు వైఎస్సార్‌సీపీ నాయకుడిగా ఉంటూ, వ్యవసాయం చేస్తున్నారు. తల్లి అల్లు గౌరి నందిగాం ఎంపీటీసీ(వైఎస్సార్‌సీపీ) సభ్యురాలు. పెద్ద కుమారుడు సుధీర్‌కుమార్ వ్యవసాయ శాఖలో ఏఈఓగా పనిచేస్తున్నాడు.

– అల్లు దినేష్, నందిగాం, తెర్లాం మండలం

మొదటి ప్రయత్నంలోనే ఎస్‌బీఐలో ఉద్యోగం..



నందిగాం గ్రామానికి చెందిన గంట సాంబశివ, పార్వతమ్మల కుమారుడు సాధిక్..మొదటి ప్రయత్నంలోనే మహారాష్ట్ర సర్కిల్‌లో ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సాధిక్ బీకామ్ చదివాడు. తండ్రి సాంబశివ గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, తల్లి పార్వతమ్మ నందిగాం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకంలో నిర్వాహకురాలిగా పనిచేస్తున్నారు.

–గంట సాధిక్, నందిగాం, తెర్లాం మండలం

రైతు బిడ్డ ప్రకాష్..



నందిగాం గ్రామానికి చెందిన కొల్లి ప్రకాష్ తెలంగాణ సర్కిల్‌లో ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రకాష్ తండ్రి సింహాచలం రైతు. తల్లి లక్ష్మణమ్మ గృహిణి. ప్రకాష్ బీఎస్సీ కెమిస్ట్రీ చదివాడు.

–కొల్లి ప్రకాష్, నందిగాం, తెర్లాం మండలం

బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంపై అవగాహన


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం బాలాజీ మార్కెట్ ఆవరణలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్ట గడవక జీవనోపాధి కోసం కష్టపడే వారిని కార్మికులంటారు. చదువుకోవాల్సిన బాల్యంలో బలమైన పనులు చేస్తున్న దుస్థితి దాపరించడం నిజంగా అందరూ ఖండించాల్సిన విషయమన్నారు. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం ప్రపంచంలో ఐదు సంవత్సరాల నుంచి 14 ఏళ్ల లోపు బాల కార్మికులు 20 కోట్ల మంది ఉన్నారని అందులో సగం మంది భారతదేశంలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. బాలకార్మిక నిషేధ, నియంత్రణ చట్టం 1986 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం 14 ఏళ్ల లోపు బాలబాలికలతో దుకాణాల్లో పనిచేయించుకున్నట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. బాల కార్మికులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి స్కూల్‌కు పంపే ప్రయత్నం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి.హిమబిందు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బీహెచ్ లక్ష్మి, జిల్లా కన్వీనర్ చైల్డ్ రైట్స్ ఫోరం చిట్టిబాబు, న్యాయవాది తాడి రాజు, బెజ్జిపురం యూత్ ఆర్గనైజేషన్ ఎన్జీవో కోఆర్డినేటర్ ఝాన్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా బాలబాలికల హక్కుల ఫోరం కన్వీనర్ చిట్టి బాబు ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిషేధంపై ప్రతిజ్ఞ చేశారు.

వచ్చే నెల 5న జాతీయ లోక్ అదాలత్

- సద్వినియోగం చేసుకోండి: జిల్లా జడ్జి పిలుపు


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: వచ్చే నెల 5వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా కోర్టు సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. రాజీ కాదగిన అన్ని క్రిమినల్ కేసులతో పాటు చెక్‌బౌన్స్ కేసులను గుర్తించి స్పెషల్ డ్రైవ్ చేపట్టి జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. తద్వారా కక్షిదారులకు డబ్బు సమయం వృథా కావన్నారు. పోలీస్ అధికారులు వారెంట్ పెండింగ్ ఉన్న కేసులు, గంజాయికి సంబంధించిన కేసులు, పోక్సో యాక్ట్‌కు సంబంధించిన కేసులలో నిందితులకు అవగాహన కల్పించాలని, తద్వారా నేరాలు తగ్గుముఖం పడతాయని అభిప్రాయ పడ్డారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి బుజ్జి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 80 మంది పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పసుపు విత్తనాలకు దరఖాస్తు చేసుకోవాలి

సీతంపేట: పసుపు విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేంద్ర సహాయ నిధుల గిరిజన ఉపప్రణాళిక పథకం కింద సమగ్ర పసుపు ప్రాజెక్టు 2025–26 సంవత్సరానికి 20 టీఎస్‌పీ మండలాల్లో పసుపు పంట సాగు చేయడానికి 90 శాతం రాయితీతో సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. 90 శాతం రాయితీతో ప్రగతి, రోమ, సేలం రకాలు అందించనున్నామన్నారు. అలాగే 90 శాతం రాయితీతో ఆర్గానిక్ ఎరువులు, బ్యాటరీ స్ప్రేయర్లు, పసుపు ఉడకబెట్టడానికి బాయిలర్స్, ఆరబెట్టుకోవడానికి పరదాలు, పసుపు పాలిష్ యంత్రాలు ఇవ్వనున్నట్లు వివరించారు.

బడి బస్సు భద్రమేనా ?


స్కూల్ బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు (ఫైల్)

- ఫిట్‌నెస్ లేని బస్సులపై అధికారుల కొరడా
- 15 ఏళ్లు దాటిన బస్సుల రిజిస్ట్రేషన్ రద్దు
- జిల్లాలో 400 బస్సులు ఫిట్‌నెస్‌లో పాస్
- మిగిలిన బస్సులకు పరీక్షలు చేస్తున్న అధికారులు

విజయనగరం టౌన్: పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు పూర్తికావచ్చాయి. గురువారం పూర్తిస్థాయిలో పాఠశాలలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులను పాఠశాలలు, కళాశాలలకు తీసుకువెళ్లి వచ్చేందుకు గాను బస్సులు ముస్తాబవుతున్నాయి. అన్ని అనుమతి పత్రాలతో, ఫిట్‌నెస్‌ను సరిచూసుకుని బస్సు పనితీరు తదితర అంశాలపై స్కూల్ యాజమాన్యాలు, ఆర్‌టీఓ అధికారులు రంగం సిద్ధం చేశారు. స్కూల్ బస్సుకు సంబంధించి అన్ని రకాల సర్టిఫికెట్లు, ఫిట్‌నెస్ సక్రమంగా ఉంటేనే తిరగాలని, లేకుంటే కఠిన చర్యలకు వెనుకాడబోమని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బడిబస్సుల భద్రతకు సంబంధించి జిల్లా రవాణాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. 15 ఏళ్లు దాటిన బస్సులకు రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తమ స్కూల్ బస్సులో క్షేమంగా వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకునేందుకు గాను బస్సుల ఫిట్‌నెస్‌ను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఫిట్‌నెస్ సక్రమంగా ఉంటేనే వాటికి అనుమతులిస్తున్నారు. జిల్లాలో 510 స్కూల్, కళాశాలల బస్సులు ఉన్నాయి. వాటిలో ఇప్పటివరకు దాదాపు 400కి పైగా బస్సులు ఫిట్‌నెస్ పూర్తిచేసుకుని పాఠశాలలు, కళాశాలలకు విధులు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. మరిన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలతో పాటూ ఇతర అనుమతి పత్రాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు.

బస్సు డ్రైవర్ ఎంపిక కీలకం

స్కూల్ బస్సు డ్రైవర్ల ఎంపికలో విద్యాసంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. శిక్షణ పొందిన, ఆరోగ్యంగా ఉన్న డ్రై వర్లకు ఎక్కువ వేతనం చెల్లించాలన్న కారణంగా 50 ఏళ్లు నిండిన వారిని ఎంపిక చేసుకుంటున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే డ్రైవర్ వయసు 50 ఏళ్లకు మించకూడదని, తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి డ్రై వర్ బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలనే నిబంధనలు ఉన్నాయి.

యాజమాన్యాలదే బాధ్యత

జిల్లాలో సుమారు 510కి పైగా స్కూల్ బస్సులు ఉన్నట్లు రవాణాశాఖ అధికారులు గుర్తించారు. వాటిలో సుమారు 400 బస్సులకు ఇప్పటికే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. నిబంధనలు పాటించని బస్సులను తిరస్కరించారు. మిగిలిన బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. అయితే తిరస్కరణకు గురైన బస్సులను మళ్లీ పరీక్షలు చేయించుకోవడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని అధికారులు అంటున్నారు. స్కూల్స్ పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో బస్సు భద్రత తప్పనిసరి అని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. బస్సులో సీట్లు, అద్దాలు, టైర్లు తదితర బస్సు సామగ్రి అన్నీ సక్రమంగా ఉనాయా? లేదా? అనేది చూసుకోవాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు.

బడి బస్సుల భారం

పార్వతీపురంటౌన్: ప్రైవేట్ స్కూల్ విద్యలో ఇటు పుస్తకాలు, ఫీజుల మోతతో పాటూ బస్సు రవాణా మరింత బరువెక్కింది. ఏటా స్కూల్ ఫీజులు పెంచుతున్న విద్యాసంస్థలు ఈ ఏడాది బస్సుల ఫీజులనూ వదల్లేదు. గతంలో పట్టణాలకు సమీపంలో రూరల్ గ్రామాలకు వెళ్లే బస్సుల్లో ఒక్కో విద్యార్థికి రూ.9వేలు, పట్టణ పరిధిలో రూ.7 వేలు వసూలు చేసేవారు. ఈ విద్యా సంవత్సరంలో రూరల్ గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు రూ.13వేలు, పట్టణ పరిధిలో విద్యార్థులకు రూ.10వేలుగా నిర్ణయించారు. చిన్నపాటి పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు రూ. 13వేల నుంచి రూ.15 వేల వరకు ఫీజ వసూలు చేస్తుంటే బస్సు రవాణాకు మరో రూ.13వేలు వరకు వసూలు చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులకు బస్సు ట్రాన్స్‌పోర్టు భారంగా మారింది. ఇద్దరు పిల్లల స్కూల్ బస్సులకు చెల్లించే సొమ్ముతో పట్టణాల్లో మూడు నెలల పాటు ఇంటి అద్దె చెల్లించవచ్చుననే ఆలోచనలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. బస్సు భారంతో స్కూల్ విద్యలోనే తరగతి చదివించేందుకు భారీ మొత్తం అవుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సూమారు. 200 వరకు ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వాటిలో 58 వరకు బస్సులు ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 18,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. బస్సుల రవాణాకే ఏడాదికి లక్షల్లో చెల్లిస్తున్నారు. స్కూలు బస్సుల రవాణా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలకు వ్యాపారం..తల్లిదండ్రులకు భారంగా మారింది.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం



ప్రతి స్కూల్ బస్సుకు సంబంధిత పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించాలి. లేకపోతే అటువంటి బస్సులను తిరగనిచ్చే ప్రసక్తే లేదు. పాఠశాల భద్రత విషయంలో రాజీపడేది లేదు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. పాఠశాలలు తెరవనున్న నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకుని బస్సులు నడపాలి. పాఠశాలలు ప్రారంభం నాటి నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం. 15 ఏళ్లు దాటిన బస్సులు, 15 ఏళ్లకు దగ్గరగా ఉన్న బస్సులు తుక్కుగా అమ్మేసి వాటి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రద్దుచేసుకోవాలి.

– మణికుమార్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, విజయనగరం

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త..!

పార్వతీపురంటౌన్: సైబర్ నేరగాళ్లు పెట్టే ప్రలోభాలకు గురికావద్దని, వారు చేసే వివిధ మోసాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అపరిచితుల నుంచి వచ్చే మొబైల్ నంబర్లకు బదులివ్వవద్దని, డిజిటల్ అరెస్టులు లాంటివి లేవని కలెక్టర్ తేల్చిచెప్పారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిజిటల్ అరెస్ట్ అని ఎవరైనా చెప్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మొబైల్‌లో ఎలాంటి బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, వాటిని సోషల్ మీడియా ద్వారా ఇతరులకు షేర్ చేయొద్దన్నారు. అలా చేసి ఇబ్బందులు, లేనిపోని సమస్యలను కొనితెచ్చుకోవద్దని కలెక్టర్ హితవు పలికారు. బెట్టింగ్ యాప్‌లు ఉపయోగించినా, ఇతరులకు ప్రమోట్ చేసినా చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. మీరు లాటరీ గెలిచారు. మీకు పాస్‌వర్డ్ వస్తుంది. లేదా మీ మొబైల్‌కు వచ్చే పిన్ నంబర్ చెప్పండంటూ సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ వివరాలు ఎవరికి తెలియజేయవద్దని సూచించారు. స్క్రాచ్ చేయండి. రివార్డు పొందండి అని వచ్చే సందేశాలను క్లిక్ చేసి ఓపెన్ చేయవద్దని, ఏపీకే (ఏపీకె) పేరు మీద డాక్యుమెంట్ వస్తుందని, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదని కలెక్టర్ వివరించారు. పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని సోషల్ మీడియాలో ప్రలోభపెట్టే యాప్‌ల జోలికి వెళ్లొద్దన్నారు.